క్లుప్తంగా

పెద్దమ్మ తల్లికి ఒడిబియ్యం సమర్పణ



పెద్దమ్మ తల్లికి పూజలు చేస్తున్న ప్రజలు

యాడికి: మండల కేంద్రంలోని పెద్దమ్మ తల్లికి ఆషాఢమాసం రెండో శుక్రవారం సందర్భంగా లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయం నుంచి మంగళ వాయిద్యాలు, మేళ తాళాలతో ఊరేగింపుగా వచ్చిన భక్తులు ఒడి బియ్యాన్ని కిట్టు స్వామి ద్వారా అందించారు.
మహిళలు రకరకాల తీపి పదార్థాలు, పసుపు, కుంకుమ, పూలు, పండ్లు అమ్మవారికి సమర్పించారు. ఆలయ కమిటీ సభ్యులు హాజరైన భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

నేడు మండల సమావేశం

పెద్దవడుగూరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ బారన్‌సాహెబ్ శుక్రవారం తెలిపారు. మండలంలోని 25 గ్రామ పంచాయతీల్లో నెలకొన్న సమస్యలను సమావేశంలో ప్రజా ప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకరావాలని సూచించారు. మండల ప్రగతి గురించి అధికారులు వివరించాలని, సంబంధిత వివరాలతో సమావేశానికి హాజరు కావాలన్నారు.
పామిడి: పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయ సభాభవనంలో శనివారం ఉదయం 10.30 గంటలకు మండల మీట్ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ కే తేజోత్స్న శుక్రవారం తెలిపారు. ప్రజా ప్రతినిధులు, సభ్యులు, అధికారులు, అనధికారులు తప్పక హాజరు కావాలని ఆమె కోరారు.

రేపు జూనోసిస్ దినోత్సవం

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 6న జూనోసిస్ దినోత్సవం నిర్వహించనున్నట్లు పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ రత్నాకర్ శుక్రవారం తెలిపారు. బీకేఎస్‌లోని పశు సంవర్ధక శాఖ కార్యాలయంలో మెగా పశు వైద్య శిబిరం ఏర్పాటు నిర్వహిస్తామన్నారు. వీధి కుక్కలు, పెంపుడు కుక్కలకు రేబిస్ వ్యాధి నివారణకు టీకాలు వేస్తామన్నారు.

పనులు వేగవంతం చేయండి



కట్ట పనులను పరిశీలిస్తున్న డీఈ వీర రాఘవులు, ఏఈ ప్రశాంత్‌కుమార్

యల్లనూరు: పాత చెరువు కట్టను తొలగించి నూతన చెరువు కట్ట పనులు వేగవంతంగా చేయాలని డీఈ వీర రాఘవులు సూచించారు. మండలంలోని 85–నిట్టూరు గ్రామంలో జీఎన్ఎస్ఎస్ పథకం కింద చెరువుకట్ట పనులను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. రూ.118 కోట్ల వ్యయంతో పాలూరు పంప్‌హౌస్, నిట్టూరు చెరువు, బుక్కాపురం చెరువు, బొప్పేపల్లి చెరువు పనులు చేయాల్సి ఉంది. నిట్టూరులో జరిగే నూతన చెరువుకట్ట పనులు, రాతికట్టడం పనులను డీఈ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మూడు నెలల్లో కట్ట పనులు పూర్తి చేయాలన్నారు. డిసెంబరు నాటికి పనులు పూర్తయ్యేందుకు సన్నాహాలు చేయాలని ఏఈ ప్రశాంత్‌కుమార్, సైట్ ఇన్‌చార్జ్ శ్రీనును ఆదేశించారు. కార్యక్రమంలో ఏఈ వాణి తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

యాడికి: మండలంలోని బోయరెడ్డిపల్లి సమీపంలో ఉన్న ఆదాని సిమెంట్ కర్మాగారంలో పనిచేసేందుకు ఎంపీడీఓ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ వీర్రాజు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని నిరుద్యోగులు దరఖాస్తు చేసుకోసుకుంటే, వారికి ఆదాని సిమెంట్ యాజమాన్యం మూడునెలల పాటు ట్రెనింగ్ ఇచ్చి, ఉద్యోగ అవకాశం కల్పిస్తారన్నారు.

'సూపర్ సిక్స్' అమలు చేయకపోతే పోరాటం



మాట్లాడుతున్న బీ మోహన్‌నాయక్

పామిడి: కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది దాటినా సూపర్‌సిక్స్ హామీలను పూర్తి స్థాయిలో నెరవేర్చకపోగా, డైవర్షన్ పాలిటిక్స్ అవలంభిస్తున్న కూటమి ప్రభుత్వ తీరుపై పోరాటం తప్పదని హరిత దివ్యాంగుల సేవాసమితి రాష్ట్ర అధ్యక్షుడు బీ మోహన్‌నాయక్ ధ్వజమెత్తారు. శుక్రవారం మండలంలోని భాదర్‌పేట జెడ్పీ హైస్కూల్‌లోని దివ్యాంగ విద్యార్థుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేవలం ఒక పింఛన్లు మినహా కూటమి ప్రభుత్వం ప్రజలకు ఒరగబెట్టిందేమి లేదన్నారు. దివ్యాంగులకు వర్తింపజేయాల్సి పరికరాలు, పథకాలు అటకెక్కాయన్నారు. దివ్యాంగులకు సంక్షేమ పథకాలను వర్తింపజేయకపోతే దివ్యాంగులంతా సంఘటితిలమై ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రమేష్, అంజి, భాస్కర్, రాజా, రాజశేఖర్ యాదవ్, మణికంత, గోపినాథ్, శంకర్, చంటి, వెంకటేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అడుగుకో గుంత..



అలూరు రోడ్డులోని గుత్తి సబ్ బ్రాంచ్ కెనాల్ సమీపంలో గుంతలు పడిన రోడ్డు

గుంతకల్లు: పట్టణంలోని అలూరు వైపు గుత్తి సబ్ బ్రాంచ్ కెనాల్ సమీపంలో రోడ్డుగా పూర్తిగా దెబ్బతింది. దీంతో వాహనాదారులు ఇబ్బందులకు గురువుతున్నారు. బళ్లారి చౌరస్తా నుంచి కరెంట్ ఆఫీస్ కార్యాలయం వరకు తరచూ రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ క్రమంలో కెనాల్ వద్ద రోడ్డుపై గుంతలు పడి రాళ్లు తేలాయి. ఇది గమనించని వాహనాదారులు గుంతలో ఉన్న రాళ్లపై ఎక్కించి ప్రమాదాల బారిన సంఘటనలు అనేకంగా ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా యాక్సిండెంట్ జోన్‌గా ఉన్న ఈ మార్గాన్ని బాగు చేయాలని వాహనాదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రమాదకరంగా కల్వర్టు



శంకరానంద కాలేజీ వద్ద కల్వర్టు ధ్వంసమైన దృశ్యం

గుంతకల్లుటౌన్: పట్టణంలోని శ్రీశంకరానంద ఎయిడెడ్ జూనియర్ కాలేజీ వద్ద కల్వర్టు పూర్తిగా దెబ్బతిని ప్రమాదకరంగా మారింది. ఆ దారి వెంట వెళ్లాలంటే ద్విచక్రవాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇక భారీ వాహనాల రాకపోకలు ఆగిపోయాయి. కాలనీవాసులు, జూనియర్ కాలేజీ, మూడు ప్రైవేట్ స్కూళ్ల విద్యార్థులు ఆ దారిలోనే రాకపోకలు సాగిస్తుంటారు. అసలే వర్షాకాలం. ఆదమరిచి ఆ దారి వెంబడి వెళ్తే ప్రమాదాలు జరిగే అవకాశముంది. మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యాన్ని వీడి కల్వర్టును మరమ్మతు చేసి ప్రమాదాలను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

డిమాండ్ల పరిష్కారం కోసం ధర్నా



గుంతకల్లు ఆర్టీసీ డిపో ఎదుట ధర్నా చేస్తున్న ఏయూ నాయకులు



గుత్తి ఆర్టీసీ డిపో ఎదుట ధర్నా చేస్తున్న ఆర్టీసీ కార్మికులు

గుంతకల్లు/గుత్తి/తాడిపత్రిరూరల్: గుంతకల్లు ఆర్టీసీ డిపో ఎదుట ఏపీపీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో సమస్యల పరిష్కారం కోసం ఉద్యోగులు శుక్రవారం ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ గత ఆరేళ్లగా పెండింగ్‌లో ఉన్న ప్రమోషన్లు ఇవ్వడంతో పాటు డీఏ బాకాయిలను చెల్లించాలన్నారు. సర్క్యులర్ 01/2019ను యథావిధిగా అమలు జరిగేలా చూడాలన్నారు. డబుల్ డ్యూటీ చేసే సిబ్బందికి ఇచ్చే డీడీ అమౌంట్‌ను పెంచాలన్నారు. డిప్యూటేషన్ల బదిలీలపై ఉన్న ఉద్యోగుల అనుమతి మేరకు వన్ టైమ్ మేజర్ కింద పర్మినెంట్ బదిలీ ఇవ్వాలన్నారు. ఆర్టీసీ హౌస్‌లో ఉద్యోగులకు అందుబాటులో ఉన్న సీసీఎస్ ఆఫీస్‌ను తరిలించాలన్న ఆలోచనను విరమించాలన్నారు. ఖాళీ పోస్టులను భర్తీ చేయాలన్నారు. ఎలక్ట్రికల్ బస్సులను ఆర్టీసీనే కొనుగోలు చేయాలన్నారు. అంతేకాకుండా కాలం చెల్లిన బస్సులకు బ్రేక్ డౌన్‌కు గ్యారేజీ సిబ్బందిని బాధ్యులను చేసి అక్రమ చార్జ్ షీట్లు ఇచ్చే విధానాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు జె.రఘువీర్, రీజనల్ సభ్యులు లోకేష్‌కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్స్ ఎం.కె. మూర్తి, జి.కృష్ణ, డిపో సెక్రటరీ ఎం.మల్లయ్య, గ్యారేజ్ కార్యదర్శి జోసఫ్, నాయకులు గిరి, హరి, కృష్ణ, సుగుణ, లలిత, ప్రసాద్, జయరాజ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

- గుత్తిలోని ఆర్టీసీ డిపో ఎదుట ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు శుక్రవారం ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్ జోనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆంజనేయులు, రీజనల్ కమిటీ సభ్యులు హసన్ సాహెబ్, డిపో ప్రెసిడెంట్ శ్రీనివాసులు, డెలిగేట్ పీకే రాముడు, సీనియర్ నాయకులు రంగన్న, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.
- తాడిపత్రిలోని ఆర్టీసీ డిపో ఆవరణలో శుక్రవారం ఎంప్లాయిస్ యునియస్ నాయకులు డిమాండ్ల సాధన కోసం ధర్నా నిర్వహించారు. ధర్నాలో ఎంప్లాయిస్ యూనియన్ డిపో సెక్రటరీ బ్రహ్మానందరెడ్డి, ఉపాధ్యక్షుడు ఆదినారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాలపై అవగాహన అవసరం



గుంతకల్లులోని ఐఓసీలో మాక్ డ్రిల్ డెమోపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం



వడియంపేటలోని గ్యాస్ ఫ్యాక్టరీలో మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: ప్రమాదాల నివారణపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ డిపో సీనియర్ మేనేజర్ హరీష్ కుమార్‌రెడ్డి సూచించారు. ప్రమాద సమయంలో అత్యవసర పరిస్థితులను ఎలా ఎదుర్కోవాలో తెలియజేసే మాక్‌డ్రిల్‌ను శుక్రవారం ఐఓసీలో నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్నిప్రమాదం ఏర్పడినపుడు తీసుకోవాల్సిన తక్షణ చర్యలు, జాగ్రత్తలను వివరిస్తూ అగ్నిమాపకశాఖ అదనపు జిల్లా అధికారి ఎస్.అశ్వత్ ఆధ్వర్యంలో అవగాహన కలిపించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమాదేవి, అగ్నిమాపకశాఖ సిబ్బంది పాల్గొన్నారు.
బుక్కరాయసముద్రం: మండలంలోని వడియంపేటలో ఉన్న హెచ్‌పీ గ్యాస్ ఫ్యాక్టరీలో డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఫ్యాక్టరీస్ రాధాక్రిష్ణ ఆధ్వర్యంలో లెవల్–2 మాక్ డ్రిల్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విపత్తు, ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ఫ్యాక్టరీ యాజమాన్యం భద్రతా ప్రామణాలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ మురళీక్రిష్ణ, అగ్నిమాపక సిబ్బంది, గ్యాస్ ఫ్యాక్టరీ సిబ్బంది పాల్గొన్నారు.

వాసవీమాత ఆలయంలో లక్ష పుష్పార్చన



గుత్తిలోని వాసవీ ఆలయంలో లక్ష పుష్పార్చన కార్యక్రమం నిర్వహిస్తున్న భక్తులు

గుత్తి: పట్టణంలోని వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆషాఢ మాసం, వారాహి నవరాత్రుల్లో భాగంగా శుక్రవారం లక్ష పుష్పార్చన కార్యక్రమం నిర్వహించారు. వేద పండితులు వాసుదేవ శర్మ, నాగార్జున శర్మ ఆధ్వర్యంలో మహిళలు పలు రకాల పుష్పాలతో సహస్ర నామావళి, అష్ట లక్ష్మి పూజలు చేశారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు తీర్థ ప్రసాదాలు వినియోగం చేశారు. ఈ సందర్భంగా వాసవీ మాతకు వజ్ర కవచ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మాకం శ్రీకాంత్, కలుగొట్ల కిశోర్ బాబు, కోశాధికారి సుదర్శన్, వాసవీ మహిళా మండలి అధ్యక్షురాలు యక్కల రాధాదేవి, కార్యదర్శి కలుగొట్ల కృష్ణవేణి, కోశాధికారిణి అచ్యుత గీతావాణి, యువజన సంఘం ప్రెసిడెంట్ తాయి వెంకటేశ్వర్లు, సెక్రటరీ వెంకట్, కోశాధికారి జక్కా మహేష్ తదితరులు పాల్గొన్నారు.
పామిడి: పట్టణంలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆషాఢ మాస శుక్రవారాన్ని పురస్కరించుకుని వాసవీ మాతృ మండలి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా పుష్పార్చన, భక్తి గీతాలాపన, పల్లకి, ఊంజల్ సేవలు చేపట్టారు.

ఘనంగా చిన్న సరిగెత్తు వేడుక



పెద్దవడుగూరులో గుండంలో వేయడానికి చెట్టు కొమ్మలను తీసుకెళ్తున్న భక్తులు



తాడిపత్రి పట్టణంలోని టైలర్స్ కాలనీలో పీర్లు

పెద్దవడుగూరు: మొహర్రం ఉత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలో శుక్రవారం చిన్న సరిగెత్తు వేడుకలను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పీర్ల స్వాములను గ్రామంలో ఊరేగించారు. సాయంత్రం భక్తులు చక్కెర చదివింపులు, పానకాలు సమర్పించారు. గ్రామంలోని యువకులు, ఉత్సాహవంతులు భారీ వృక్షాలను ఎద్దులతో తరలించి అగ్ని గుండంలోకి సమర్పించారు. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్ఐ ఆంజనేయులు బందోబస్తు ఏర్పాటు చేశారు.
గుత్తి: గుత్తిలో శుక్రవారం చిన్న సరిగెత్తు వేడుకలు ఘనంగా నిర్వహించారు. బారే హిమామ్, పగ్గాలు, బొడ్డు, చందన మామ పీర్ల చావిడిలు వద్ద భక్తులు చక్కెర చదివించారు. పీర్ల మకాన్‌ల వద్ద భక్తులతో సందడి నెలకొంది.
తాడిపత్రి రూరల్: పట్టణంలో శుక్రవారం మొహర్రం వేడుకలు వైభవంగా నిర్వహించారు. భక్తులు పీర్లను దర్శించుకుని చక్కెర చదివించారు. పట్టణంలోని టైలర్స్ కాలనీ, గాంధీకట్ట, నందలపాడు, పాతకోట, శ్రీనివాసపురం, గన్నెవారిపల్లి కాలనీ తదితర ప్రాంతాల్లో హిందూ, ముస్లింలు పీర్లను ఏర్పాటు చేశారు.

అల్లూరి సీతారామరాజు'కు నివాళి

గుత్తి రూరల్: మండలంలోని బేతాపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం రంగనాథ్ ఆధ్వర్యంలో జరిగిన అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గుత్తి ఆదర్శ పాఠశాలలో అత్యధిక మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థులకు వరుసగా రూ.20వేలు, రూ.15వేలు, రూ.10వేలు, గణితంలో 90 మార్కులకు పైగా వచ్చిన ఏడుగురు విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.1000 చొప్పున ఉపాధ్యాయిని నిరుపమా నగదును అందజేశారు. అదే విధంగా పాఠశాల ఉపాధ్యాయిని సులోచన సైన్స్ సబ్జెక్ట్‌లో 90 మార్కులు పైన తెచ్చుకున్న విద్యార్థులకు నగదును అందించారు. గుత్తి పట్టణానికి చెందిన గోపాల్ రూ.5 వేలు, ఉపాధ్యాయుడు మాదన్న రూ.3వేలు విలువ చేసే కుర్చీలను పాఠశాలకు అందించారు. ఈ సందర్భంగా దాతలను ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఓబుళపతి, రామకృష్ణయ్య, సులోచన, శివప్రసాద్, రవీంద్రనాథ్‌రెడ్డి, నరేంద్రనాథ్‌గౌడ్, నిరుపమ, విజయకుమారి, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం నాగరాజు, ఉపాధ్యాయులు సుజాత, రత్నకుమారి, సురేష్, చంద్రకళ, శ్రీదేవి, మాదన్న పాల్గొన్నారు.

ఘనంగా మాజీ సీఎం రోశయ్య జయంతి

గుంతకల్లుటౌన్: ఏపీ మాజీ సీఎం కె.రోశయ్య జయంతి సందర్భంగా అవోపా ఆధ్వర్యంలో శుక్రవారం కసాపురం రోడ్డు లో ఏర్పాటు చేసిన శిబిరంలో ఉచితంగా డయాబెటిక్ నిర్ధారణ పరీక్షలను నిర్వహించారు. అనంతరం చక్కెర వ్యాధిగ్రస్తులకు జాగ్రత్తలు, ఆహార నియమాల గురించి వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అవోపా అధ్యక్ష, కార్యదర్శులు రాము, సుబ్రమణ్యం, కోశాధికారి కోటా రఘు, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గోపా జగదీష్, జయంతి వెంకట్ తదితరులు పాల్గొన్నారు.
గుత్తి: పట్టణంలోని కన్యకా పరమేశ్వరి ఆలయం ప్రాంగణంలో శుక్రవారం మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య జయంతి వేడుకలను ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గుత్తి, గుత్తి ఆర్ఎస్ ఆర్యవైశ్య సంఘాల సభ్యులు రోశయ్య చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మాకం శ్రీకాంత్, కిశోర్ బాబు, మధుసూదన్ గుపా పాల్గొన్నారు.

రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలి



పొట్టి శ్రీరాములు సర్కిల్‌లో ధర్నా చేస్తున్న పీడీఎస్‌యూ విద్యార్థులు

గుంతకల్లు: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే చెల్లించాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి వీరేంద్రప్రసాద్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక పొట్టి శ్రీరాములు సర్కిల్ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న రూ.4,200 కోట్ల ఫీజు రియింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించకపోతే విద్యార్థులు రోడ్డున పడతారని ఆవేదన వ్యక్తం చేశారు. బీటెక్ పూర్తి అయినా ఫీజులు చెల్లించపోవడంతో కళాశాల యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వకుండా వేధింపులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అసెంబ్లీ సమావేశాల్లో రూ.2,400 కోట్లు బడ్జెట్ కేటాయించినా ఇంతవరకూ విద్యార్థుల ఖాతాల్లో జమ కాలేదన్నారు. త్వరలోనే ఎంసెట్, డిగ్రీ, పీజీ కౌన్సిలింగ్‌లు ఉన్న నేపథ్యంలో సమస్య పరిష్కరించాలన్నారు. అంతేకాకుండా విద్యార్థులకు శాపంగా మారిన జీఓ 77ను వెంటనే రద్దు చేయాలన్నారు. పీడీఎస్‌యూ నాయకులు ఉదయ్‌బాబు, తేజ, మహేంద్ర, భీమ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధే లక్ష్యంగా కృషి చేయాలి

గుంతకల్లు రూరల్: నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా అధికారులు కృషి చేయాలని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం సూచించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నియోజకవర్గంలోని మూడు మండలాల అధికారులతో స్వర్ణాంధ్ర విజన్ రివ్యూ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గుంతకల్లు నియోజకవర్గ వ్యాప్తంగా చేపడుతున్న అభివృద్ధి పనులు, మంజూరు కావాల్సిన పనులు తదితర వివరాలను అధికారులు వివరించారు. గుంతకల్లు మండలంలోని గొందెర్ల, పామిడి మండలంలోని అక్కజాంపల్లి గ్రామాలకు ఇప్పటి వరకూ రోడ్డు నిర్మాణం జరగలేదన్నారు. గుంతకల్లు మండలంలోని మొలకలపెంట, వెంకటాంపల్లి, గుండాల తండా గ్రామాల్లో నీటి సమస్య అధికంగా ఉందన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో హంద్రీ–నీవా జలాలతోపాటు, తుంగభద్ర జలాలు అందుతున్న నేపథ్యంలో అనువుగా ఉన్నచోట ఎస్ఎస్ ట్యాంక్‌ల నిర్మాణం చేపట్టి, నీటిని నిలువ చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. జనన, మరణ ధ్రువీకరణ పత్రాలతోపాటు, పొజిషన్ సర్టిఫికెట్లు త్వరితగతిన మంజూరు చేసేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీనివాస్, ఎంపీపీ బీవీ మాధవి, జెడ్పీటీసీ కదిరప్ప, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమ్మె తాత్కాలిక విరమణ

గుంతకల్లుటౌన్: మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమస్య పరిష్కారానికి మున్సిపల్ శాఖ 15 రోజులు గడువు తీసుకున్న నేపథ్యంలో కార్మికులు గత నెల 23 నుంచి చేపట్టిన నిరవధిక సమ్మెను తాత్కాలిక విరమిస్తున్నట్లు కార్మిక జేఏసీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు సురేష్, మల్లేష్ శుక్రవారం తెలిపారు. శనివారం నుంచి విధుల్లోకి హాజరవుతామన్నారు. తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం త్వరితగతిన పరిష్కరించకపోతే తిరిగి యథావిధిగా సమ్మెను కొనసాగించి పోరాటాలను ఉధృతం చేస్తామన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గుత్తి రూరల్: మండలంలోని బాచుపల్లి గ్రామ శివారులో 44వ నంబర్ జాతీయ రహదారిపై శుక్రవారం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల వివరాల మేరకు.. మండలంలోని కె.ఊబిచెర్ల గ్రామానికి చెందిన మద్దిలేటి, వెంకట్రాముడు పని నిమిత్తం ద్విచక్రవాహనంలో గుత్తికి వస్తున్నారు. బాచుపల్లి గ్రామ శివారులో ఎన్టీపీసీ క్రాస్ వద్ద ఎదురుగా మరో ద్విచక్రవాహనం వేగంగా వచ్చి ఢీకొంది. ప్రమాదంలో మద్దిలేటి, వెంకట్రాముడుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే వారిని గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం వారిని అనంతపురానికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'మాదిగ మహామేళాకు తరలిరండి'

గుంతకల్లుటౌన్: ఒంగోలులో ఈ నెల 7న నిర్వహించే మాదిగ మహా మేళా సభకు భారీగా తరలిరావాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కోకన్వీనర్ భీమలింగప్ప కోరారు. శుక్రవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద మహామేళా సభకు సంబంధించిన కరపత్రాలను ఆయన విడుదల చేశారు. ఎమ్మార్పీఎస్ నియోజకవర్గం ఇన్‌చార్జ్ ఎర్రిస్వామి, పట్టణ అధ్యక్షుడు సంపత్, నాయకులు రమేష్, కిరణ్, మురళి, తదితరులు పాల్గొన్నారు.

పొలం రస్తా విషయమై ఘర్షణ

యాడికి: పొలం రస్తా విషయంలో మండలంలోని లక్షుంపల్లిలో మహదేవ రెడ్డి, గంగిరెడ్డి కుటుంబాలకు శుక్రవారం ఉదయం గొడవ జరిగినట్లు పోలీసులు తెలిపారు. ఇరు వర్గాలకు చెందిన వారికి గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయనున్నట్లు పోలీసులు తెలిపారు.

'వైద్యుల జీవితాలతో చెలగాటమాడొద్దు'

గుంతకల్లుటౌన్: పర్మినెంట్ రిజిస్ట్రేషన్ కోసం ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాడుతున్న యువ వైద్యుల జీవితాలతో కూటమి ప్రభుత్వం చెలగాటమాడుతోందని వైఎస్సార్ యువజన విభాగం అధ్యక్షుడు అబ్దుల్‌బాసిద్ విమర్శించారు. విజయవాడలో ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ఎదుట నిరసన తెలుపుతున్న యువ వైద్యులపై దాడిని ఆయన తీవ్రంగా ఖండించారు. మహిళలని కూడా చూడకుండా జుట్టు పట్టుకుని ఈడ్చుకుంటూ ట్రక్కుల్లో పడేయడం హేయమైన చర్యగా ఆయన అభివర్ణించారు. యువ వైద్యులకు పర్మినెంట్ రిజిస్ట్రేషన్ ఇవ్వకపోతే వైఎస్సార్‌సీపీ యువజన విభాగం ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహిస్తామని ఆయన శుక్రవారం ఓ ప్రకటనలో హెచ్చరించారు.

మైనార్టీ రుణాలకు దరఖాస్తు చేసుకోండి

పుట్లూరు: మైనార్టీ రుణాల కోసం దరఖాస్తులను స్వీకరించనున్నట్లు ఎంపీడీఓ అలివేలమ్మ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 2025–2026 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మండలానికి నాలుగు మైనార్టీ యూనిట్ రుణాలు మంజూరయ్యాన్నారు. మైనార్టీలుగా ఉండి 21 సంవత్సరాల నుంచి 55 సంవత్సరాల వయస్సు లోపు ఉన్న అర్హులైన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

'సమ్మె జయప్రదం చేయండి'

పామిడి: విద్యుత్ చార్జీల పెంపు, స్మార్ట్ మీటర్ల ఏర్పాటును నిరసిస్తూ ఈ నెల 9న దేశవ్యాప్త సమ్మెలో భాగంగా పామిడిలో సీపీఎం ఆధ్వర్యంలో అనుబంధ సంఘాల సారథ్యంలో నిర్వహిస్తున్న సమ్మెలో కార్మికులు, ఉద్యోగులు పాల్గొని జయప్రదం చేయాలని సీపీఎం సీనియర్ నాయకుడు పీ అనిమిరెడ్డి కోరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పార్టీ, అనుబంధ సంఘాల సమావేశంలో సమ్మెపై సమీక్షించారు. కార్యక్రమంలో అనుబంధ సంఘాల మండల నాయకులు, మల్లేసు, చంద్రమోహన్‌రెడ్డి, ముత్యాలు షాషావలి తదితరులు పాల్గొన్నారు.

వివేకానందుడి విగ్రహావిష్కరణ

యాడికి: మండలంలోని నగరూరు ఉన్నత పాఠశాలలో శుక్రవారం దాతల సహాయంతో వివేకానందుడి విగ్రహాన్ని ఆవిష్కరించారు. వైఎస్సార్ జిల్లా పోరుమామిళ్ల మండలం ఓబుళాపురంలోని వివేకానంద ఫౌండేషన్ యజమాని రామకృష్ణారెడ్డి రూ.50 వేలు ఖర్చు చేసి వివేకానంద విగ్రహాన్ని చేయించారని హెచ్‌ఎం కుళ్లాయప్ప, గణిత ఉపాధ్యాయుడు శ్రీనివాసులు తెలిపారు. కార్యక్రమంలో పోరుమామిళ్లకు చెందిన రాజోలు శ్రీధర్ రెడ్డి, ఓబులేసు, రాజు, శ్రీనివాసులు రెడ్డి, రమానంద రెడ్డి, రవితో పాటు ఉపాధ్యాయులు, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

నాసిరకంగా హాస్టల్ మరమ్మతులు

పామిడి: పట్టణంలోని ఇంటిగ్రేటెడ్ హాస్టల్ మరమ్మతులు కూటమి ప్రభుత్వ ఆధ్వర్యంలో నాసిరకంగా చేపట్టారని ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గ అధ్యక్షుడు వి.వినోద్ ధ్వజమెత్తారు. శుక్రవారం హాస్టల్ మరమ్మతులను ఆ సంఘం మండల నాయకులతో కలసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సోషల్ వెల్ఫేర్ ఫండ్ కింద 19 లక్షలతో చేపట్టిన హాస్టల్ పనుల్లో నాణ్యత కొరవడిందన్నారు. పైపై రంగుల పూతతో కాంట్రాక్టర్ జేబులు నింపుకున్నాడన్నారు. సోషల్ వెల్ఫేర్ జిల్లా ఉన్నతాధికారులు హాస్టల్ నాసిరకం పనులను పర్యవేక్షించి, కాంట్రాక్టర్‌పై చర్యలు చేపట్టాల్సిలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆసంఘం మండల నాయకులు, ఫయాజ్, ఆసిఫ్, సల్మాన్, హర్షిత్, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం

పెద్దవడుగూరు: మండల కేంద్రంలోని ఆదర్శ విద్యా నికేతన్ పాఠశాలలో 2024–25 పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన ప్రవంతి, ప్రశాంతి అనే విద్యార్థులకు కుమ్మెత బాల చెన్నారెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యులు రామసుబ్బమ్మ, జానకిరామయ్య చెరో రూ.5,000 నగదు ప్రోత్సాహకం అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ నారాయణ రావు, సిబ్బంది పాల్గొన్నారు.

వివరాలు సరిచూసుకోండి

పుట్లూరు: రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు రూ.20 వేలు ఇవ్వనున్నట్లు ఏఓ కాత్యాయని శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రైతులు అన్నదాత సుఖీభవ పోర్టల్‌లో ఆధార్ నంబర్‌తో తమ వివరాలను సరి చూసుకోవాలన్నారు. జాబితాలో పేర్లు లేకపోతే 155251 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు.